# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విడతలవారీగా నెరవేర్చుతున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.
- ❖ ఓర్వకల్లను డ్రోన్ హబ్ గా తీర్చిదిద్దేందుక ప్రభుత్వం కృషి చేస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.
- ❖ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను సంవత్సరం పాటు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- ❖ ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న భారత సైనికులకు సంఘీభావంగా ఈరోజు విశాఖలో తిరంగా యాత్రను చేపట్టారు.

===========================

దేశంలో అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామి నిలపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నీ విడతలవారీగా నెరవేర్చుతున్నామని అన్నారు. జూన్ 12న పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం పేరుతో 9 వేల కోట్ల రూపాయలను తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని జోడించి ప్రతీ రైతుకు 20 వేల రూపాయలను పెట్టుబడి సహాయం కింద అందిస్తామన్నారు. ఆగస్ట్ 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

===========================

ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఈరోజు కర్నూలు నగరంలో మినీ మహానాడు జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.... అనేక పరిశ్రమలు రాష్ట్రానికి రాబోతున్నాయని తెలిపారు. ఓర్వకల్లను డ్రోన్ హబ్ గా తీర్చిదిద్దేందుక ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

=============================

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు... చిరస్మరణీయులని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఈరోజు నెల్లూరులో నిర్వహించిన జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత మార్చి 16న ప్రారంభమైన అమరజీవి జయంతి ఉత్సవాలను వచ్చే ఏడాది మార్చి 16 వరకూ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్ర రాజధానిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు. అలాగే నెల్లూరులో 22 ఎకరాల్లో దేశంలోనే అత్యుత్తమ మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నామని.. దానికి పొట్టిశ్రీరాములు మార్కెట్ గా నామకరణం చేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

=============================

ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న త్రివిధ దళలా సైనికులకు సంఘీభావంగా ఈరోజు కూటమి నేతలు విశాఖలో తిరంగా యాత్రను చేపట్టారు. దేశ ఐక్యతకు చిహ్నంగా విశాఖ పౌరులు ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కూటమి నేతలతో పాటు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు.

అలాగే పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో త్రివిధ దళాలకు మద్దతుగా తిరంగా యాత్ర నిర్వహించారు. గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకొని త్రివిధ దళాలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సైనికులను సన్మానించారు.

=============================

అన్నమయ్య జిల్లా బాలమువారిపల్లి వద్ద ఐదుగురు ప్రయాణిస్తున్న కారు బావిలోకి దూసుకెళ్లడంతో ఈరోజు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా... మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన శివన్న, లోకేశ్, గంగులయ్య, సునీల్, తిప్పారెడ్డి అనే వ్యక్తులు కారులో ప్రయాణిస్తుండగా ఈరోజు తెల్లవారిజమున బాలమువారిపల్లె వ్యవసాయ పొలాల సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సునీల్, తిప్పారెడ్డి ప్రాణాలతో బయటపడగా.. శివన్న, లోకేశ్, గంగులయ్య మృతి చెందారు.

విరామం

=============================

ఆపరేషన్ సిందూర్ విజయానికి సంఘీభావంగా భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనాలను తెలుపుతోంది. సాయుధ దళాలకు నివాళిగా ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా కార్గిల్ యుద్ధంలో అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించిన పరమ వీర చక్ర అవార్డు గ్రహీత యోగేంద్ర సింగ్ యాదవ్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

(వాయిస్ 49 సెకన్లు)

=============================

గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఈరోజు పాడేరులో సీజనల్ వ్యాధులపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... ఏజెన్సీలో అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సంభవించకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులతో బాధపడుతున్న వారు

వైద్య పరీక్షల నిమిత్తం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలోని హెల్త్ మానిటరింగ్ సెల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

============================

వేసవిలో తీర్ధ యాత్రలకు వెళ్ళే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని IRCTC టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ DSGP కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ఈ నెల 22 నుండి జూలై 13వ తేదీ వరకు మూడు యాత్రల కోసం ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నామని ఆయన వెల్లడించారు. దీనిలో భాగంగా మే 22వ తేదీన ఈ యాత్ర సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్తుందని తెలిపారు. జూన్ 14వ తేదీన రెండవ యాత్ర, జూలై 05వ తేదీన మూడవ యాత్ర ప్రారంభమవుతాయని వెల్లడించారు.

============================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని టీటీడీ అధికారులు వెల్లడించారు.

============================

ఉత్తర అంతర కర్ణాటక మీదుగా రాయలసీమ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతాలపై నున్న ఉపరితల ఆవర్తన, ద్రోణి ప్రభావాలతో రాష్ట్రంలో రేపు పలు ప్రాంతాలలో వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారి ఎల్. నారాయణ వెల్లడిస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

============================

వాతావరణ శాఖ సూచనల మేరకు రాగల రెండు రోజుల్లో కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఈరోజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

============================
============================